క్లుప్తంగా

'కృత్రిమ అవయవాల' శిబిరానికి విశేష స్పందన



దివ్యాంగులకు కొలతలు తీస్తున్న నారాయణ సేవా సంస్థాన్ సిబ్బంది

సీతంపేట: రాజస్థాన్ ఉదయ్‌పూర్‌కు చెందిన నారాయణ సేవా సంస్థాన్ అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో ఆదివారం నిర్వహించిన కృత్రిమ అవయవాల కొలతల శిబిరానికి విశేష స్పందన లభించింది. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 500 మంది దివ్యాంగులు కృత్రిమ అవయవాల కోసం కొలతలు తీయించుకున్నారు. వారికి రెండు, మూడు నెలల్లో కృత్రిమ అవయవాలు అందజేస్తామని సంస్థ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ మార్వాడి సంస్థలు, లయన్స్ క్లబ్, ఆంధ్రా ఆర్టిస్ట్ ఫెడరేషన్, సోషల్ మీడియా క్లబ్, డాక్టర్ చిరంజీవి కళాపరిషత్, స్థానిక నారాయణ సేవా సంఘం ప్రతినిధులు వైద్య శిబిరానికి వచ్చిన దివ్యాంగులకు ఆహారం అందించారు. నారాయణ సేవా సంస్థాన్ డైరెక్టర్ రంజిత్ గౌడ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించవద్దు

సీతంపేట: రహదారులను ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు హెచ్చరించారు. ఆదివారం అక్కయ్యపాలెంలో తోపుడుబళ్ల వ్యాపారులతో ఆయన మాట్లాడారు. అక్కయ్యపాలెం నుంచి దొండపర్తి కూడలి వరకు రహదారులను ఆక్రమించి తోపుడుబళ్లు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. ఇటీవల రహదారి విస్తరణ చేపట్టినప్పటికీ ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఇబ్బందులు తలెత్తకుండా తోపుడు బళ్లు ఏర్పాటు చేసుకోవాలని, లేదంటే పొక్లెయిన్‌తో బళ్లతో తరలిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ వాణిశ్రీ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, పేడాడ రమణికుమారి

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మాధవధారలో స్థానిక కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి కలిసి ప్రారంభించారు. ప్రతి ఏటా మండుటెండల్లో బాటసారుల దాహాన్ని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారని వారన్నారు. పాదచారులకు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సనపల వరప్రసాద్, పద్మ, నంబాల ఈశ్వరరావు, సనపల హరిబాబు, సనపల శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ఏఎస్సార్ నగర్‌లో వజ్రపు రాకేష్‌కుమార్(46) తల్లితో కలిసి నివసిస్తున్నాడు. ఇతను డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. కొన్నేళ్లుగా భార్య పిల్లలకు దూరంగా ఉంటున్నాడు. ఇతడికి మద్యం తాగే అలవాటు ఉంది. మూడు రోజులుగా మానసిక స్థితి బాగోలేదు. ఈక్రమంలో అతడి కుమారుడు మానసిక ఆస్పత్రికి తీసుకెళ్దామనుకుని నగరంలోని మెంటల్ ఆస్పత్రికి వెళ్లి చూడగా ఆదివారం సెలవు కావడంతో కుమారుడు ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి తండ్రి గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించాడు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- నూకాంబిక అన్నసమారాధనలో..



జోగారావునగర్‌లో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కె.కె.రాజు

- క్రైస్తవ ప్రార్థనల్లో..



సంజీవయ్య కాలనీ చర్చి ప్రార్థనల్లో పాల్గొన్న కె.కె.రాజు

- ముస్లింల ప్రార్థనలో..



ముస్లింల ఇఫ్తార్ విందులో పాల్గొని ప్రార్థన చేస్తున్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

అన్ని వర్గాలతో మమేకం

- ప్రజల్లో కలియ తిరుగుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతంపేట/కంచరపాలెం/మద్రిపాలెం: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్ని వర్గాల ప్రజలతో మమేకమవుతున్నారు. కుల, మత, పార్టీల బేధం లేకుండా అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ.. ఆత్మీయంగా కలుసుకుంటూ.. కుటుంబ సభ్యుడిలా మెలుగుతున్నారు. సర్వమత ప్రార్థనల్లో పాలుపంచుకుంటున్నారు. నియోజకవర్గ సమన్వయకర్తగా ప్రజలకు విశేష సేవలందించిన ఆయన.. ఎమ్మెల్యేగా పోటీ చేస్తూ తనను ఆదరించి గెలిపిస్తే ప్రజల్లోనే ఉంటూ మరింత సేవ.. మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసి చూపిస్తానని హామీ ఇస్తున్నారు. ప్రజలందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని, ఆయనను మళ్లీ ఆశీర్వదించాలని కోరుతున్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

జీవీఎంసీ 43వ వార్డు అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డులోని గౌరీ కల్యాణ మండపం పక్కన ఉన్న చర్చి, 47వ వార్డు సంజీవయ్య కాలనీ–1, 2 ప్రాంతాల్లోని లోగో చర్చి, బెతస్థ చర్చిలను ఆదివారం వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సందర్శించారు. క్రీస్తు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యంగా ప్రజలకు మెరుగైన సేవలు, మౌళిక వసతుల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము కామేశ్వరి, 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, జేసీఎస్ మండల కన్వీనర్ వసంతల అప్పారావు, చర్చి ఫాదర్లు చలం, రత్నరాజు, సింగ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



80 ఫీట్ రోడ్డు చర్చిలో కె.కె.రాజును సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు



బెతస్థ చర్చిలో కె.కె.రాజుకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న చిన్నారి

నూకాంబికను దర్శించుకున్న కె.కె.రాజు

జీవీఎంసీ 49వ వార్డు బర్మాక్యాంప్‌లో కొలువైన నూకాంబిక అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బర్మా కాందిశీకుల సంక్షేమ సంఘం నాయకులు, మహిళా మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అమ్మవారిని దర్శించుకుని, భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్ శశికళ, రత్నాకర్, బీఎస్ రాజు, లక్ష్మణరావు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

55వ వార్డు కంచరపాలెం జోగారావునగర్‌లో నూకాంబిక అమ్మవారిని వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జోగి మోహన్‌రావు(గురుస్వామి) నేతృత్వంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. సుమారు 2 వేల మందికి అన్నదానం చేసినట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్ శశికళ, వార్డు అధ్యక్షుడు కాయిత పైడి రత్నాకర్ యాదవ్, బీఎస్ రాజు, లక్ష్మణరావు పాల్గొన్నారు.



బర్మాక్యాంప్‌లో అన్నప్రసాదం వడ్డిస్తున్న కె.కె.రాజు, చొక్కాకుల, అల్లు శంకరరావు

ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందు

ఏక్యూజే గ్రూప్ అధినేత, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ.హెచ్.ఫరూఖీ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం వద్ద ఆదివారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఘనంగా ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథి రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేసిన అనంతరం విందు స్వీకరించారు.

అభివృద్ధిని చూసి గెలిపించండి



ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును సత్కరిస్తున్న రేసపువానిపాలెం కమిటీల సభ్యులు

సీతమ్మధార: అభివృద్ధిని చూసి ఆదరించి.. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో తనను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు కోరారు. 24వ వార్డు రేసపువానిపాలెం గ్రామ సభ్యులు, శాంతి స్వరూపిణి దుర్గా ఆలయ కమిటీ, త్రీ టెంపుల్స్ బాయ్స్ కమిటీ సభ్యులతో ఆదివారం రాత్రి ఆయన పార్టీ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. రేసపువానిపాలెం గ్రామ పెద్దలు కె.కె.రాజును సత్కరించారు. కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ మురళీకృష్ణారెడ్డి, గుడ్ల అశోక్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు బేరి గురుమూర్తి రెడ్డి, కమిటీ సభ్యులు, దుర్గా ఆలయ కమిటీ ప్రెసిడెంట్ బొదెరెడ్ల గురునాథ్‌రెడ్డి, కమిటీ సభ్యులు, పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

బాపూజీనగర్ సంఘ సభ్యులతో సమావేశం

సీతమ్మధార: జీవీఎంసీ 48వ వార్డు బాపూజీనగర్ గ్రామ సంఘ సభ్యులతో ఆదివారం రాత్రి బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని చూసి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గంగరాజు, గోపి, డా.దామోదర్, సురేష్, శంకర్, ముక్క రమణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన



త్రీ స్టార్ వాకర్స్ క్లబ్ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు



కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో టీ చేస్తూ వ్యాపారిని పలకరిస్తున్న కె.కె.రాజు

- వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- తనను గెలిపించాలని వాకర్స్‌కు అభ్యర్థన

కంచరపాలెం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ అందరి హృదయాల్లో సంక్షేమ వారధిగా సుస్థిర స్థానం సంపాదించుకున్నారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఆదివారం ఉదయం ఆయన మార్నింగ్ వాక్ నిర్వహించారు. కార్పొరేటర్ చల్లా రజిని, పార్టీ వార్డు అధ్యక్షుడు చల్లా ఈశ్వరరావు ఆధ్వర్యంలో త్రీ స్టార్ వాకర్స్ క్లబ్ సభ్యులతో మాట్లాడారు. వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేస్తూ ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాలనలో సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పేద, మధ్యతరగతి ప్రజలకు బాసటగా నిలిచారన్నారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సుపరిపాలన అందిస్తామన్నారు. అనంతరం పలువురు బెడ్ పేషెంట్లను పలకరించి ఆర్థిక, ఆరోగ్య భరోసా ఇచ్చారు. మార్నింగ్ వాక్‌లో పలువురు సీనియర్ వాకర్లు కె.కె.రాజు విజయానికి దీవెనలు అందించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని వాకర్స్‌ను కె.కె.రాజు కోరారు. అనంతరం వార్డులో పలువురు చిరు వ్యాపారులను ఆత్మీయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో 54, 55 వార్డుల ఎన్నికల పరిశీలకుడు బాకీ శ్యాంకుమార్‌రెడ్డి, చల్లా వెంకటేష్, కణిత చిరంజీవి, కాయిత పైడి రత్నాకర్ యాదవ్, ప్రకాష్, అప్పలనాయుడు, సోమేశ్, రాధాకృష్ణ, కల్యాణ్‌రాజు, ఎంవీవీ రెడ్డి, లక్ష్మి, రమణమ్మ, మాలతి, వెలగ శ్రీను, శ్రీనివాసరెడ్డి, నమ్మి శంకర్, సీనియర్ నాయకులు అమర్ రెడ్డి, నూకరాజు, బొడ్డేటి గంగామహేష్, అంబటి శైలేష్, బద్రీ, రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

150 మందికి కంటి వైద్య పరీక్షలు



వృద్ధురాలి కంటిని పరీక్షిస్తున్న ఆప్తమాలజిస్ట్

మురళీనగర్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మాధవధార మహిళా వాకర్స్ క్లబ్, మాదవ సమాజం ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఆదివారం కోదండ రామస్వామి ఆలయంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 30 మందికి ఉచిత కంటి శస్త్రచికిత్సకు పేర్లు నమోదు చేయించుకున్నారు. వీరిని శంకర్ ఫౌండేషన్ బుధవారం హాస్పిటల్‌కి తీసుకువెళ్లి శస్త్రచికిత్స చేస్తారని మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి తెలిపారు. శంకర్ ఫౌండేషన్ హాస్పిటల్ ఆప్తమాలజిస్ట్ కె.గంగాధర్, సీఈసీ డిప్యూటీ మేనేజర్ ఎం.అరుణ్‌కుమార్, కో ఆర్డినేటర్ వై.పైడిరాజు, క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి, మాధవ యువజన సమాజం అధ్యక్షులు సనపల రాంగోపాల్, పుష్పలత, సీతారామం ఏర్పాట్లు చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అడిషనల్ సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం, ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, మురళీనగర్ రెసిడెన్షియల్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్, నారాయణ స్వామి పాల్గొన్నారు.

ఉగాది అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి



అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

తాటిచెట్లపాలెం: క్రోధి నామ సంవత్సర ఉగాది తెలుగు ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఆదివారం రైల్వే న్యూకాలనీలోని సింకా గ్రాండ్ హోటల్‌లో జర్నలిస్టుల ఉగాది సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథి చంద్రమౌళి, గౌరవ అతిథులు మట్టపల్లి హనుమంతరావు, హైదర్ అలీ సింకా జర్నలిస్టులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. పురోహితులు పంచాంగ శ్రవణం చేశారు. పల్సర్ బైక్ ఝాన్సీ, కొరియోగ్రాఫర్ రమేష్, జబర్దస్త్ హాస్యనటుడు రాపేటి అప్పారావు తమ ప్రదర్శనలతో అలరించారు. మౌనిక ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షుడు పి.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు జి.శ్రీనివాసరావు, బ్రాడ్‌కాస్ట్ అసోసియేషన్ అర్బన్ అధ్యక్షుడు ఈరోతి ఈశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు డి.రవికుమార్, సాంబశివరావు, బందరు శివప్రసాద్, కోశాధికారి మూర్తి, సీనియర్ జర్నలిస్టులు ఆర్.నాగరాజ్ పట్నాయక్, కిల్లి ప్రకాశరావు, ఆనంద్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర వాతావరణంలో జీవించాలి

మహారాణిపేట: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'నా ఆరోగ్యం –నా హక్కు' అన్న నినాదంతో 1948 నుంచి ప్రతి ఏటా ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత వరకు మంచినీరు తాగడం, ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించడం, మంచి ఆహారం భుజించడం చేయాలన్నారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవన రాణి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్లు సయ్యద్ బేగం, కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాది పర్వదినాన బంగారు చీరలో లలితాదేవి

సీతంపేట: ఉగాది పర్వదినం సందర్భంగా లలితానగర్ లలితా పీఠంలో కొలువైన లలితాదేవి అమ్మవారు బంగారం చీర అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. పీఠం 75వ వార్షికోత్సవంలో భాగంగా భక్తులు, దాతల విరాళాలతో అమ్మవారికి రెండు కిలోల బంగారంతో చీర చేయించిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 22న అమ్మవారికి పీఠాధిపతి చేతు ల మీదుగా బంగారు చీర అలంకరించారు. మళ్లీ మొదటి సారి బంగారు చీర అలంకరణలో దర్శనమివ్వనున్నారు. ఈ నెల 9న మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8 గంటల వరకు లలితాదేవి బంగారు చీరలో దర్శనం ఇస్తారని, భక్తులు దర్శించి తరించాలని కృష్ణసేన్ కోరారు.

జీఆర్పీ అదుపులో పాత నిందితుడు

తాటిచెట్లపాలెం: పాత గంజాయి కేసులో నిందితుడై, తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ తెలిపిన వివరాలిలా.. విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో ఆదివారం జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా.. పాత గంజాయి కేసులో ముద్దాయిగా ఉండి పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న ఒడిశా రాష్ట్రం, కలహండి జిల్లాకు చెందిన అక్రమ్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇతడు ఆదివారం రైల్వే స్టేషన్‌లో గంజాయిని రవాణా చేసేందుకు రెక్కీ చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పాత కేసులో ఏ3 నిందితుడని జీఆర్పీ ఎస్ఐ జి శ్రీనివాసరావు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం: మద్రిపాలెం రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలిలా.. ఆదివారం ఉదయం మద్రిపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మరణించి ఉన్నాడు. వయసు సుమారు 28–30 ఏళ్లు, సుమారు 5.7 అడుగుల ఎత్తు, గోధుమరంగు శరీరం కలిగి, వైట్ అండ్ బ్రౌన్ కలర్ టవల్ ధరించాడు. జీఆర్పీ సీఐ ధనుంజయ నాయుడు ఆదేశాలతో ఎస్ఐ వి.బాలాజీరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని రైల్వే పోలీసులకు గానీ, 96661 22722, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని ఎస్ఐ బాలాజీరావు కోరారు.

త్రిముఖ విఘ్నేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు రేపు



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్, అర్చకులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్‌లోని త్రిముఖ విఘ్నేశ్వర స్వామి దేవాలయంలో ఉగాది పండగను పురస్కరించుకుని మంగళవారం ఉదయం 7 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు ఏడిద గురునాథ్ శర్మ, ఆలయ చైర్మన్ టీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఆలయ ఆవరణలో ఆదివారం ఉగాది వేడుకల కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు కోలాటం, సాయంత్రం 6.30 గంటలకు పంచాగ శ్రవణం జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎస్ ప్రకాశరావు, ఎం.రంగారావు, ఎం.సత్యనారాయణ, ఎం.తులసీకుమార్, వెంకటలక్ష్మి, ఎం.శ్రీదేవి, కె.సరోజని, కె.రత్నం భక్తులు పాల్గొన్నారు.

కె.కె.రాజుకు ఆటో సంఘాల మద్దతు



ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు మద్దతు పలుకుతున్న ఆటో సంఘాల నాయకులు

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కె.కె.రాజుకు పలు ఆటో సంఘాలు మద్దతు పలికాయి. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఉత్తర పార్టీ కార్యాలయంలో ఆదివారం పలువురు ఆటో సంఘాల నాయకులు ఆయనను కలిసి మద్దతు తెలిపారు. మేలో జరిగే ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలిపిస్తామని హామీ ఇచ్చారు.

'భవ్య రామారామం'పై ఆధ్యాత్మిక ప్రసంగం



ప్రసంగిస్తున్న డాక్టర్ నారాయణరావు

సీతంపేట: విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘురామారావు అధ్యక్షతన ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం 'భవ్య రామారామం'పై ఆధ్యాత్మిక సాహిత్య కార్యక్రమం జరిగింది. రాజమహేంద్రవరానికి చెందిన డాక్టర్ టి.వి.నారాయణరావు 'నాటి అయోధ్యలో రామ పాలన'పై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. శ్రీరాముని గుణగణాలు, రామరాజ్యం, రాముని సుపరిపాలన అనే అంశాలపై వాల్మీకి రామాయణంలోని పలు శ్లోకాలను ఉదహరిస్తూ ప్రసంగించారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ వి.విజయసారధి 'నేటి అయోధ్యలో రామప్రతిష్ట' అనే అంశంపై మాట్లాడారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణ నేపథ్యం, మందిరంలోని విశేషాలను తెలియజేశారు. సంస్థ కార్యదర్శి ప్రయాగ సుబ్రహ్మణ్యం రామాయణ ప్రశస్తిని వివరించారు. అనంతరం ప్రసంగకర్తలను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.వి.సూర్యారావు, డాక్టర్ వి.విజయగోపాల్, మేడా మస్తాన్‌రెడ్డి, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

పరమత సహనంతోనే శాంతి



మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట: మతం ఒక నమ్మకమని, ద్వేషాలు మాని పరమత సహనం కలిగి ఉండటం శాంతికి పునాదని గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా బీవీ ఫౌండేషన్, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం ఆధ్వర్యంలో ఆదివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో అన్ని మతాల వారు కలిసిమెలిసి జీవించే శాంతి నగరంగా ప్రసిద్ధి పొందిందన్నారు. ముస్లిం మత పెద్దలు హుస్సేన్, అహమ్మద్ ఖాసిం మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రాముఖ్యాన్ని వివరించారు. రంజాన్ నెలలో పవిత్రమైన నడవడి కలిగి ఉండటం మతంలోనే ఆరోగ్య సూత్రం పాటించడం.. తద్వారా మంచి నడవడి, నిగ్రహం, శాంతి అలవడతాయన్నారు. సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రజనీకాంత్, హరగోపాల్, శంకరరావు, చాట్ల బాబూరావు, రెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా శిష్టకరణాల ఉగాది సంబరాలు



వేడుకల్లో పాల్గొన్న శిష్టకరణాల ప్రముఖులు

సీతంపేట: శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది తెలుగు ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగును తేవాలని శిష్టకరణం యువత, ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మానాపురం సురేష్‌కుమార్ ఆకాంక్షించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ శిష్టకరణం సోదర సోదరీమణులంతా ఒక చోట చేరి ఉగాది వేడుకలు జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా శిష్టకరణం ప్రముఖులను సన్మానించారు. అనంతరం జరిగిన పంచాంగ శ్రవణంలో ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పంటలు పండి రాష్ట్రం, దేశం సస్యశ్యామలంగా ఉంటాయని పురోహితులు తెలిపారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వీరబాబు, రవికాంత్, రమేష్, మానస వినోద్, నర్సింగ్, గాయత్రి, శ్రీదేవి పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ ఎస్ఐ వెంకటరావు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ విజయకుమార్ ఆదేశాల మేరకు ఎస్ఐ వెంకటరావు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి అల్లర్లు, గొడవలు చేయకుండా ఉండాలని, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని, హద్దు మీరితే చర్యలు తప్పవని రౌడీషీటర్లను హెచ్చరించారు.

- ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు సీఐ ఎస్.రమేష్ ఆదేశాల మేరకు ఎస్ఐ ధర్మేంద్ర కౌన్సెలింగ్ చేశారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇంటి వద్ద కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్.శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తం

సీతమ్మధార: నగరంలో జరుగుతున్న దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ ద్వారకా జోన్ క్రైం పోలీసులు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్వారకానగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, గుర్తు తెలియని వ్యక్తులు వస్తే తక్షణమే స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలని, నగదు, బంగారు ఆభరణాలను బ్యాంకులో దాచుకోవాలని క్రైం పోలీసులు సూచించారు.